# సాక్షి అనకాపల్లి

శనివారం, 4, నవంబర్, 2023




## న్యూస్‌రీల్

### గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఎక్సైజ్ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** జిల్లాలో సారా తయారీ, రవాణా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సారా తయారీ, గంజాయి రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. రవాణా నేరాల్లో పట్టుబడిన వారు రిమాండ్‌లో ఎక్కువ రోజులు ఉండేలా కేసులు నమోదు చేయాలని సూచించారు. కల్తీ మద్యం తాగడం వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. అడిషినల్ ఎస్పీ, ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ సారా తయారీకి అవకాశం ఉండే ప్రాంతాలు, తయారుచేసే వ్యక్తులు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. ప్రభుత్వపరంగా సరఫరా చేస్తున్న సురక్షితమైన మద్యం అమ్మకాలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.వి.రమణ, సీఐలు పాల్గొన్నారు.

### 6న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

**అనకాపల్లిటౌన్:** మండలంలోని తుమ్మపాల ఖోఖో మైదానంలో ఈ నెల 6వ తేదీన ఖోఖో జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్టు ఉమ్మడి విశాఖ ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, సీహెచ్ఎల్ఎం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ 32వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఖోఖో పోటీలు గుంటూరు జిల్లా నర్సారావుపేటలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరుగుతాయన్నారు. ఈ పోటీలకు సంబంధించి జట్ల ఎంపికను నిర్వహిస్తున్నామని, ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2010 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 8309960421 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- జేసీ జాహ్నవి



పాఠశాల భవన నిర్మాణంపై సూచనలిస్తున్న జేసీ జాహ్నవి

**ఎస్.రాయవరం:** ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ జాహ్నవి హెచ్చరించారు. చినఉప్పలం రెవెన్యూ సర్వే నంబర్ 55లో 35 సెంట్ల భూమిని ప్రభుత్వ పాఠశాల భవనానికి కేటాయించినట్టు చెప్పారు. అయితే ఈ భూమి తమదని చెబుతూ చలపాక నాగమణి, కలిదిండి అప్పలనర్స స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం విచారణకు వచ్చిన జేసీ జాహ్నవి ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారివద్ద ఆధారాలు లేకపోవడంతో ఆక్రమణదారులుగా నిర్ధారించారు. పైగా స్పందనలో తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా పాఠశాల భవన నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్న ఈ ఇద్దరి పై కేసునమోదు చేయాలని స్థానిక ఎస్‌ఐ ప్రసాద్‌రావుకు సూచించారు. వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈవో అప్పారావులను ఆదేశించారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్ కాలనీ రోడ్డు సమస్యను కూడా జేసీ పరిశీలించారు. జేసీ వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### విజయనగరం-రాయగడ లైన్‌లో పలు రైళ్లరద్దు

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్ రాయగడ-విజయనగరం పరిధిలో జరుగుతున్న ఆధునీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈ నెల 5న విశాఖపట్నం-రాయగడ (08504) పాసింజర్ స్పెషల్, ఈ నెల 6న రాయగడ-విశాఖపట్నం (08503) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం (08546 / 08545) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7న కోరాపుట్ -విశాఖపట్నం(18511) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

**గుంటూరు-రాయగడ గమ్యం కుదింపు**

ఈ నెల 5న గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 6న రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరు చేరుకుంటుంది.

# ప్రగతికి రహదారి



చినగదిలి నుంచి సూర్యతేజనగర్ వరకు రోడ్డు ఇలా..

- రూ.112 కోట్లతో మేజర్ రహదారుల నిర్మాణం
- ఇప్పటికే చాలా వరకు పూర్తి
- వివిధ దశల్లో మరికొన్ని..

**దాబాగార్డెన్స్:** విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నగర సుందరీకరణకు జీవీఎంసీ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ చేపడతోంది. అధునాతనంగా రోడ్లను తీర్చిదిద్దుతోంది. నగరంలో రద్దీ దృష్ట్యా జంక్షన్ల అభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాల్లో చివరి స్థాయికి చేరుకున్నాయి. పెదవాల్తేర్ కరకచెట్టు పోలమాంబ గుడి నుంచి నేరుగా బీచ్‌కు పెద్ద ఎత్తున రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఆరిలోవ పరిధి సాయిబాబా ఆలయం (బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి)నుంచి ఆరిలోవ జంక్షన్‌కు రూ.2.35 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. సీతమ్మధారలో రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఇలా సిటీ పరిధితో పాటు భీమిలి, గాజువాక, అనకాపల్లి పరిధిలో రోడ్ల విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి.

**జోన్ల వారీగా...**

జోన్-1 పరిధిలో రూ.9.38 కోట్లతో ఒక రోడ్డు, జోన్-2 పరిధిలో రూ.7.11 కోట్లతో రెండు రోడ్లు, జోన్-3 పరిధిలో రూ.5.36 కోట్లతో ఒక రోడ్డు, జోన్-4 పరిధిలో రూ.16.04 కోట్లతో 3 రోడ్లు, జోన్-5ఏ పరిధిలో రూ.13.46 కోట్లతో రహదారి, జోన్-6 పరిధిలో రూ.11.39 కోట్లతో రోడ్డు, జోన్-7 పరిధిలో రూ.14.89 కోట్లతో 6 రోడ్లు, జోన్-8 పరిధిలో రూ.34.63 కోట్లతో 4 రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. వీటిలో దాదాపు పనులు పూర్తి కావచ్చాయి. కొన్ని ప్రారంభ దశలో ఉన్నాయి. ఇవే కాకుండా ఆయా వీధుల్లో అంతర్గత రహదారులు కూడా కొన్ని పూర్తవగా మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. జోన్-2 పరిధిలో రూ.3.94 కోట్లతో కైలాసగిరి మేజర్ రోడ్డు పనులు, రూ.3.17 కోట్లతో సూర్యతేజనగర్, శ్రీకాంత్‌నగర్ జంక్షన్‌లో రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.2.40 కోట్లతో సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘ నిధులతో విజేత సూపర్‌మార్కెట్ జంక్షన్ నుంచి సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల వరకు రూ.2 కోట్లతో చేపట్టిన పనులు 50 శాతం మేర పూర్తయ్యాయి. ఎలక్ట్రికల్ పోల్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.2.32 కోట్లతో కొమ్మాది జంక్షన్, లా కాలేజ్, ఎండాడ జంక్షన్, డెయిరీఫాం జంక్షన్, హనుమంతవాక జంక్షన్లో చేపట్టిన పనులు 35 శాతం మేర జరిగాయి.

### అనకాపల్లి జోన్

అనకాపల్లి జోన్ పరిధిలో రూ.3 కోట్ల 6 లక్షలతో పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్, రూ.94.10 లక్షలతో కోల్డ్ స్టోరేజ్ నుంచి అండర్ బ్రిడ్జ్ (వయా రైల్వే స్టేషన్ రోడ్డు) వరకు, రూ.3 కోట్ల 39 లక్షలతో వై.జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ వరకు చేపట్టిన పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.2 కోట్ల 47 లక్షలతో జాతీయ రహదారి-16 నుంచి వల్లూరు వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.3 కోట్ల 61 లక్షలతో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు, రూ.కోటి 41 లక్షలతో నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు చేపట్టిన పనులు ప్రగతిలో ఉండగా, 15వ ఆర్థిక సంఘ నిధులతో అనకాపల్లి మెయిన్‌రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కొట్నివీధి, పెట్రోల్ బంక్ నుంచి నాగులాపల్లి కెనాల్ వరకు రూ.48 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి.



రాజుపాలెం రహదారి



మెయిన్ రోడ్డులో డివైడర్ పనులు చేస్తున్న సిబ్బంది



సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారి వై జంక్షన్ వరకు డివైడర్ మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

### పరిపాలన రాజధానిగా విశాఖ



పరిపాలన రాజధానిగా విశాఖ కానున్న నేపథ్యంలో రహదారులు విస్తరించాల్సిన అవసరం ఉంది. విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నగర సుందరీకరణలో భాగంగా రోడ్లు విస్తరిస్తున్నాం. అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నాం. జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో రోడ్డు విస్తరణతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాం. ఇప్పటికే చాలా రోడ్లు పూర్తయ్యాయి. కొన్ని పనులు ప్రగతిలో ఉండగా, మరికొన్ని పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశాం. జీవీఎంసీ పరిధిలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాం. కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్ల ఆధునీకరణ, జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

## అందరి సహకారంతో సాధికార సభ విజయవంతం

- కృషి చేసిన వారికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృతజ్ఞతలు



**మాడుగుల:** నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార సభ అందరి సహకారంతో విజయవంతమైందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష ప్రజానీకానికి, సభ విజయవంతానికి కృషి చేసిన అన్ని సామాజిక వర్గాల ప్రజలు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. సభ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన పోలీసు అధికారులను ఆయన అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి ఆధ్వర్యంలో కళాకారులు ఆలపించిన జానపద గేయాలు నృత్యాలు ప్రజల్లో జోష్ నింపాయన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రానున్న కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఇదే జోష్‌ను రానున్న ఎన్నికల వరకు కొనసాగించాలని చెప్పారు. మాడుగులలో మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలన్నారు.

## దేశాభివృద్ధిలో గిరిజన యువత భాగస్వాములు కావాలి

- ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి



మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

**రాంబిల్లి :** దేశాభివృద్ధిలో గిరిజన యువత భాగస్వాములు కావాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పిలుపునిచ్చారు. మండలంలోని పూడి సమీపంలో గల ఎంఎస్‌ఎంఈ కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న 15వ ట్రైబల్‌యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను శుక్రవారం ఆమె ప్రారంభించారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన 200 మంది గిరిజన యువతీ యువకులకు ఇక్కడ శిక్షణ ఇస్తారు. సంస్కృతి, భాష, సంప్రదాయ వారసత్వంపై అవగాహన కల్పించడానికి గిరిజన యువత ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు దోహదపడతాయని సత్యవతి తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు-నెహ్రూ యువకేంద్రం, హోం మంత్రిత్వ శాఖల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో జార్ఖండ్, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జిల్లాల నుంచి గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన గిరిజన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, విశాఖపట్నం జిల్లా యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరావు, ఎంఎస్‌ఎంఈ సీనియర్ మేనేజర్ డాక్టర్ టి.విజయ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా అభ్యసన సామర్థ్య పరీక్షలు

- 95 శాతం విద్యార్థులు హాజరు



నక్కపల్లిలో జరుగుతున్న పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో

**అనకాపల్లి రూరల్:** విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)-2023 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 24 మండలాల్లో 996 సెక్షన్లకు 612 పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. ఇన్విజిలేటర్లుగా 995 మంది డిగ్రీ విద్యార్థులను పరీక్షల నిర్వహణకు వినియోగించారు. 3,6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం,పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహించారు. 3వ తరగతి విద్యార్థులకు మూడో తరగతి సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వతరగతి సిలబస్‌పై ప్రశ్నపత్రాల్లో ప్రశ్నలు ఇచ్చారు. జిల్లాలో 3వ తరగతి విద్యార్థులు 7,002 మంది, 6వ తరగతి విద్యార్థులు 8,682 మంది, 9వ తరగతి విద్యార్థులు 8933 మంది మొత్తం 24,587 మంది పరీక్షలకు హాజరయ్యారని డీఈవో ఎం వెంకట లక్ష్మమ్మ చెప్పారు. వీరిలో 23,103 మంది ఆంగ్ల మాధ్యమం 1,484 మంది తెలుగు మాధ్యమం విద్యార్థులున్నారు. 95 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు ఆమె చెప్పారు. నక్కపల్లి మండలంలో పరీక్షలు నిర్వహణ తీరును ఆమె స్వయంగా పరిశీలించినట్టు తెలిపారు. ఓఎంఆర్ విధానంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను అనకాపల్లి పట్టణంలోని జీవీఎంసీ హైస్కూల్‌లో భద్రపరచనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక సిబ్బంది జవాబు పత్రాల స్కానింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు.

**అభ్యసన సామర్థ్య పరీక్షలతో మెరుగైన ఫలితాలు**

**నక్కపల్లి:** విద్యార్థులకు అభ్యసన సామర్థ్య పరీక్షల నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా నక్కపల్లిలోని పలు పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల్లో వెనుకబాటుతనాన్ని గుర్తించి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నక్కపల్లి గురుకుల పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆమె పరిశీలించారు. డీఈవో వెంట ఎంఈవో కుంచం నరేష్ ఉన్నారు.

### వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం పరిశీలకుడిగా కాశీ విశ్వనాథం



కాశీ విశ్వనాథం



మొల్లి అప్పారావు

**సాక్షి, విశాఖపట్నం:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడిగా కాశీ విశ్వనాథం, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడిగా మొల్లి అప్పారావును నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### స్వల్ప వర్షసూచన

**అనకాపల్లిటౌన్:** రాగల ఐదు రోజులు స్వల్పంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం. బి.జి.ఎస్.కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న 3 మిల్లీమీటర్లు, 5న 8, 6న 5, 7న 3, 8న 2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం కురుస్తుందని, ఉష్ణోగ్రతలు 33.4 నుంచి 33.5 డిగ్రీలు నమోదవుతాయని పేర్కొన్నారు

## సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్
- జిల్లాలో ఏర్పాట్లను వివరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి తెలిపారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం కలెక్టర్, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ కేవీ మురళీకృష్ణ పలు అంశాలను ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా తీసుకున్న చర్యలు, ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రత, ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు, మరణించిన వారి వివరాల తనిఖీ వంటి అంశాలను వివరించారు. జిల్లాలో పోలింగ్ అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారుల నియామకం, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను తెలియజేశారు. జిల్లాలో పలు నియోజకవర్గాలలో సమస్యాత్మక ప్రాంతాల్లో తలెత్తే సమస్యలపై తీసుకున్న చర్యలను గురించి తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లు, జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితులపై ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

**నేడు,రేపు ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు**

కొత్త ఓటర్ల నమోదు కోసం జిల్లాలో శనివారం, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని, అర్హత గల ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉన్నదీ లేనిదీ తెలుసుకోవచ్చన్నారు. అవసరమైన వారు ఫారం-6,7,8 ద్వారా ఓటు హక్కు కోసం, మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



వివిధ జిల్లాలనుంచి వచ్చిన క్రీడాకారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

**నక్కపల్లి:** చదువుతో పాటు, క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని, విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యతోపాటు, ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారుల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా హెటిరో కంపెనీ ఆర్థిక సాయంతో రూ.9 లక్షల వ్యయంతో క్రీడా మైదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ హాకీ ద్వారా నక్కపల్లికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది క్రీడాకారులతో క్రీడా ప్రాంగణంలో సందడి నెలకొంది. బాలికలు, బాలురకు వేర్వేరుగా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రదర్శించిన థింసా నృత్యం, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు, విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, చిత్తూరు తదితర 13 జిల్లాల నుంచి సుమారు 470 మంది హాకీ క్రీడాకారులు హాజరయ్యారు.

**తొలిరోజు పోటీలు**

శుక్రవారం బాలుర విభాగంలో వైఎస్సార్ కడప-శ్రీకాళం, విశాఖపట్నం-కర్నూలు జట్ల మధ్య, బాలికల విభాగంలో గుంటూరు-విజయనగరం, పశ్చిమగోదావరి-చిత్తూరు, కర్నూలు-తూర్పు గోదావరి జిల్లాల జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. ఈ నెల 5వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఏడీ రవిబాబు,స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిలు నాగేశ్వరరావు, శేఖర్, ఎంఈవో కుంచం నరేష్ ,హెచ్ఎంలు రాణి లలిత, కోడి శ్రీనివాసరావు, నూకరాజు, ఎస్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం నక్కపల్లిలో బీఎస్ హాకీ క్లబ్ ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన క్లబ్ వ్యవస్థాపకులు కోచ్‌లు బి.సూరిబాబు, కొల్నాటి తాతాజీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# అగ్రి టూరిజంగా చింతపల్లి పరిశోధన స్థానం

- బి.ఆర్.కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఏడీఆర్ సురేష్‌కుమార్


సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేస్తున్న విద్యార్థినులు

**నర్సీపట్నం:** చింతపల్లి పరిశోధన స్థానాన్ని అగ్రి టూరిజంగా అభివృద్ధి చేస్తున్నామని సంబంధిత ఏడీఆర్ ఎం.సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక బి.ఆర్.ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అగ్రి సెట్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులో మంచి ర్యాంకులు సాధించిన వారు భవిష్యత్తులో ఉద్యోగులుగా స్థిరపడతారన్నారు. త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తున్న అగ్రి టూరిజంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది అగ్రిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నర్సాపురంలో ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. అగ్రి సెట్ ర్యాంకుల సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. లక్ష్యంగా చదివితే భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, కిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- వెంకన్నపాలెం మసీదును సందర్శించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

**చోడవరం:** ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో వెంకన్నపాలెం గ్రామ మసీదులో శుక్రవారం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు రిజర్వేషన్లతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు మరిన్ని పథకాలు, సౌకర్యాలు కల్పించారన్నారు. ఎప్పుడూ ముస్లింలకు అండగా ఉంటున్నారన్నారు. వెంకన్నపాలెంలో మసీదు అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. అంతా ఐకమత్యంగా ఉండి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వార్డు మెంబరు పాము అప్పలనాయుడు, ముస్లింల సంఘం ప్రతినిధులు షేక్ రహమాన్, సుభానీ, బాషా పాల్గొన్నారు.

## మేనత్తకు భక్తిగీతాలతో ధర్మశ్రీ నివేదన


భజన కార్యక్రమంలో హార్మోనియం వాయిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

**మాడుగుల రూరల్:** ప్రముఖ ఆధ్యాత్మిక కర్త, బైటో భజన భక్తురాలు దివంగత సాలాపు కాసులమ్మ 23వ వర్ధంతి కార్యక్రమం మండలంలో కె.జె.పురంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా తన మేనత్త కాసులమ్మ చిత్రపటానికి పూలమాలతో ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఘన నివాళులర్పించారు. తన ఇంటి వద్ద తెల్లవారుజాము 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అర్ధ ఏకాహం నిర్వహించారు. ఈ ఏకాహంలో ధర్మశ్రీ ఉదయం నుంచి భజన, హార్మోనియం వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. స్థానిక భజన బృందం సభ్యులతోపాటు సమరతా సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి పాల్గొన్నారు.



# విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవు

- సచివాలయ ఉద్యోగులపై డీఎల్డీవో మంజులావాణి ఆగ్రహం


ఎంపీడీవో,అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

**యలమంచిలి:** విధులకు గైర్హాజరై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని డివిజన్ లెవెల్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ మంజులావాణి హెచ్చరించారు. యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం, పులపర్తి గ్రామాల్లో సచివాలయాలను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పని తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంత మంది సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మాకొడుతున్నారని, సమయపాలన పాటించడం లేదని తన దృష్టికి వచ్చినట్టు చెప్పారు. యూనీఫాం వేసుకురాని ఉద్యోగులతో రూ. 500 వరకు ఫైన్ కట్టించాలని, మూడు రోజులు సమయ పాలన పాటించని ఉద్యోగులకు సీఎల్ కట్ చేయాలని సంబంధింత సచివాలయాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ ఏఎన్ఎంలు, అధికారులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ యోజన కార్డుల మంజూరును వేగవంతం చేయాలని, ప్రతి సచివాలయం పరిధిలో నాలుగు వందల చొప్పున ఆయుష్మాన్ కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతచేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఇంజినీర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు తునిలో కోటి బిల్వార్చన


కోటి బిల్వార్చన కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆలయం


స్వామివారి కోటి బిల్వార్చనకు సంబంధించి ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

- కేరళ నుంచి పందళ రాజ వంశీకులు రాక
- శబరిమలై ఆలయ పూజారితో పూజా కార్యక్రమాలు

**నక్కపల్లి:** కాకినాడ జిల్లా తునిలో శనివారం కోటి బిల్వార్చన కార్యక్రమం జరగనుంది. ఉత్తరాంధ్రలోనే తొలిసారిగా నిర్వహించే ఈ కార్యక్రమానికి 30 వేల మంది అయ్యప్ప భక్తులు తరలి రానున్నారు. కేరళ శబరిమలై సన్నిధానం నుంచి పందళ రాజవంశీకులు, అయ్యప్ప స్వామి ఆలయ ప్రధానార్చకులు మేల్‌శాంతి, తిరు ఆభరణాలు తీసుకెళ్లే స్వామి చండా వాయిద్య కళాకారులు హాజరు కానున్నారు. మాలధారణ భక్తులకు అవసరమైన వసతులు, ఫలహారం, వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నాయి. శనివారం వేకువజామునే అష్ట దవ్య లక్ష్మీగణపతి హోమం, దండపాణి గురుస్వామి జయంతోత్సవం సందర్భంగా కట్రాళ్ల కొండ వద్ద అయ్యప్పస్వామి గుడి నుంచి సభా స్థలం వరకు వందలాది మంది అయ్యప్ప భక్తులతో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి పడి పూజ, కోటి బిల్వార్చన కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. తుని, పాయకరావుపేట జంట నగరాలకు చెందిన అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండుపాణి గురు స్వామి పర్యవేక్షణలో కోటి బిల్వార్చన పడిపూజ చేస్తారు. ఇక్కడ పూజా ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా తయారు చేసి అలంకరించారు. పదునెంబాడి మెట్లను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని కృత్రిమంగా తయారు చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు జాతీయ రహదారి ఆనుకుని డిగ్రీ కళాశాల పక్కన 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


అమ్మిరాజు (ఫైల్)


నాగేశ్వరరావు (ఫైల్)

**నక్కపల్లి:** మండలంలో జాతీయ రహదారిపై శుక్రవారం వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం... ఉదయం కాకినాడ జిల్లా పందూరు గ్రామానికి చెందిన నేదూరు అమ్మిరాజు(55) తన మోటారు సైకిల్‌పై నక్కపల్లి వైపు వస్తుండగా, వెనుక నుంచి మితిమీరిన వేగంతో వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే అతడు మరణించాడు. ఇతను మోటారు సైకిల్‌పై వివిధ ప్రాంతాల్లో మామిడి తాండ్ర విక్రయిస్తుంటాడని తెలిసింది. గొడిచర్ల వద్ద పీఎల్‌పురం గ్రామానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు (50) తన మోటారు సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మరణించాడు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విభీషణ్‌రావు తెలిపారు.

**ట్రాక్టర్ బోల్తా యువకుడి మృతి : మరొకరికి గాయాలు**

**నాతవరం:** మండలంలో డి.ఎర్రవరం కూడలి వద్ద శుక్రవారం ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందాడు. జిల్లేడుపూడి గ్రామానికి చెందిన చిరుకూరి లక్ష్మణ్(25) ఘటనా స్థలంలో మృతి చెందగా, ములగపూడికి చెందిన రమణ గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

**గుర్తుతెలియని వ్యక్తి...**

**అనకాపల్లి టౌన్:** మండలంలో పిసినికాడ జాతీయ రహదారిపై వాహనం ఢీకొన్న ప్రమాదంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందాడు. రోడ్డు దాటుతున్న అతడిని విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయ మార్చురీలో భద్రపరిచామని రూరల్ ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు తెలిపారు.

# హెచ్‌ఎంతో ఉపాధ్యాయుడి 'సెల్'గాటం

- హెచ్‌ఎం ఫోన్ దాచేసిన వైనం
- ఏటికొప్పాక హైస్కూల్‌లో కలకలం

**యలమంచిలి (అనకాపల్లి రూరల్):** యలమంచిలి మండలం ఏటికొప్పాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఓ ఉపాధ్యాయుడు హెచ్‌ఎం మొబైల్ ఫోన్‌ను తస్కరించిన సంఘటన కలకలం రేపింది. దాని కోసం సాయంత్రం 6 గంటల వరకు విచారణ కొనసాగడంతో అంతవరకూ ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇక్కడ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు (స్కూల్ అసిస్టెంట్) వి. వెంకటేష్ హెచ్‌ఎం కాండ్రేగుల సూర్యనారాయణ మొబైల్‌ను తస్కరించి స్కూల్ డాబాపై వాటర్ ట్యాంక్ వద్ద దాచిపెట్టాడు. దాంతో ఫోన్ గురించి ఉపాధ్యాయులందరినీ హెచ్‌ఎం అడిగారు. తామెవరమూ తీయలేదని సమాధానమిచ్చారు. ఈలోగా ఉపాధ్యాయుడు రమణ సమాచారం మేరకు యలమంచిలి రూరల్ కానిస్టేబుల్ వచ్చి పాఠశాలలో విచారించారు. అక్కడ సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా, ఉపాధ్యాయుడు వెంకటేష్ తీసినట్టు గుర్తించారు. చేసిన తప్పును సదరు ఉపాధ్యాయుడు అంగీకరించి క్షమాపణ పత్రం రాశాడు. పాఠశాల పరువు పోతుందని, ఈ విషయాన్ని బయట పెట్టలేదు. అయితే పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను వినియోగించకూడదని ఇటీవల విద్యా శాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించడమే కాకుండా ఇక్కడ మధ్యాహ్నం నుంచి తరగతులను నిర్వహించకుండా విద్యార్థుల విలువైన సమయాన్ని వృథా చేయడం గమనార్హం. దీనికి సంబంధించి హెచ్‌ఎం సూర్యనారాయణను సంప్రదించగా ఇదంతా వాస్తవమేనన్నారు. బాలల జాతీయ సైన్స్‌ఫేర్‌కు సంబంధించిన నమూనాలను తయారు చేయించాలని హెచ్‌ఎం చెప్పడంతోనే అతని మొబైల్‌ను తస్కరించినట్టు తెలిసింది.

# కె.జె.పురంలో ఆలయ హుూండీ చోరీ


పగులుగొట్టిన హుూండీ


**మాడుగుల రూరల్:** మండలంలోని కె.జె.పురంలో కాళ్ల వారి నూతి వద్ద మహాలక్ష్మి, ఎరుకులమ్మ ఆలయం హుూండీని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులుగొట్టి నగదు ఎత్తుకుపోయారు. గతంలో ఒక పర్యాయం హుూండీని పగులుగొట్టి నగదు పట్టుకుపోయారు. తాజా ఘటనలో నాలుగు వేల రూపాయల వరకు చోరీ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామంలో పోలీసు గస్తీని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై హర్షం

**చోడవరం:** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు హర్షం వ్యక్తం చేశారు. చోడవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులతోపాటు అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం యోచిస్తే అందరికీ మంచి జరుగుతుందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపడంపై ప్రభుత్వానికి తమ యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

**నక్కపల్లి:** రాష్ట్రంలో అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం పట్ల ఏపీడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, పాయకరావుపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆచంట రామకృష్ణ, కార్యదర్శి డి.శ్రీనివాస్‌కుమార్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు మంత్రి మండలి సమావేశంలో ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం పట్ల యావత్ జర్నలిస్టు సోదరులు రుణపడి ఉంటారన్నారు. మంత్రిమండలి నిర్ణయాన్ని త్వరగా అమల్లోకి తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలిచ్చేందుకు కేబినెట్ సమావేశంలో సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం పట్ల ఏపీఎఫ్‌యూఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న విలేకర్లందరికి త్వరలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

# భార్యను చంపిన భర్తకు యావజ్జీవ జైలు


అప్పికొండ ధర్మసింగ్ మహేష్

**విశాఖ లీగల్:** అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భార్యను అతి కిరాతకంగా చంపిన హంతకుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ నగరంలోని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 17 నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని మూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ బర్కత్ ఆలీ అందించిన వివరాలివీ.. నిందితుడు అప్పికొండ ధర్మసింగ్ మహేష్ అనకాపల్లి జిల్లా రాంబిల్లి పోలీస్ స్టేషన్ పరిధి భోగాపురం నివాసి. అతనికి నాగమణితో వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సవ్యంగా సాగింది. తర్వాత కుటుంబంలో కలహాలు, చిల్లర గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో 2009 జనవరి ఒకటో తేదీన సాయంత్రం నాలుగు గంటల సమయంలో భార్యాభర్తలు గొడవపడ్డారు. ఆ సమయంలో నిందితుడు మహేష్ ఇంట్లోని లాంతరులో కిరోసిన్‌ను నాగమణి ఒంటిపై పోసి నిప్పు పెట్టాడు. తీవ్ర గాయాల మధ్య నాగమణిని కేజీహెచ్‌లో చేర్చారు. మూడు రోజులపాటు చికిత్స పొంది ఆమె మరణించింది. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ అధికారి నవీన్ గులాటి కేసు దర్యాప్తు చేశారు. కేజీహెచ్‌లో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302, 498 ఏ, సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా చెప్పారు.

# కారును ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డ గంజాయి ప్యాకెట్లు

- బైక్‌తో ఉడాయించిన స్మగ్లర్


చెల్లా చెదురుగా పడి ఉన్న గంజాయి ప్యాకెట్లు

**నర్సీపట్నం:** మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డి పాలెం-తుని మెయిన్ రోడ్డుపై చెల్లా చెదురుగా పడిన గంజాయి ప్యాకెట్లు కలకలం రేపాయి. గంజాయి స్మగ్లర్ తన బైక్‌పై సంచిలో గంజాయి ప్యాకెట్లను తుని వైపు తీసుకువెళ్తున్నాడు. బారికేడ్లను తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. దీంతో బైక్‌కు పక్కన వేలాడుతున్న సంచిలోని గంజాయి ప్యాకెట్లు రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయాయి. వాటిని తీస్తే పోలీసులకు దొరికిపోతామనుకున్న స్మగ్లర్ బైక్‌తో ఉడాయించాడు. స్థానికులు గుమ్మిగా చేరడంతో అటుగా వస్తున్న నాతవరం ఎస్సై రామారావు వాటిని పరిశీలించారు. వెంటనే ఎస్సై సుధాకర్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్సై చేరుకుని వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ఆ మార్గంలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

# ఆటోలో 15 తులాల బంగారం చోరీ

- 40 నిమిషాల్లో దొంగలను పట్టుకున్న పోలీసులు
- సొత్తు రికవరీ, ఇద్దరు మహిళల అరెస్ట్

**పెందుర్తి:** ఓ ఉపాధ్యాయురాలి వద్ద బంగారు ఆభరణాలు చోరీ గురైన కేసును పెందుర్తి క్రైం విభాగం పోలీసులు 40 నిమిషాల్లో ఛేదించారు. నిందితులను పట్టుకుని వారి నుంచి బంగారాన్ని రికవరీ చేశారు. పెందుర్తి క్రైం ఎస్ఐ ఎండీ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాలివీ.. వేపగుంట సమీపం లక్ష్మీపురంలో ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలే రౌతు సత్యవతి శనివారం కుటుంబ కాశీకి వెళుతున్న నేపథ్యంలో బంగారు ఆభరణాలను ఎన్ఏడీ కొత్తరోడ్డులో తన తల్లి వద్ద ఉంచేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో 15 తులాల బంగారు ఆభరణాలు సంచిలో సర్దుకుని శుక్రవారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అదే సమయంలో నాయుడుతోట వద్ద ఇద్దరు మహిళలు ఆటో ఎక్కి చాకచక్యంగా దొంగలించారు. కాసేపటికి విషయం గుర్తించిన ఆమె వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే రంగంలోకి దిగిన పెందుర్తి క్రైం విభాగం పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు.

## క్లుప్తంగా

### నేడు గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేల్పుల రామారావు ఇంటి నుంచి ఆరోజు మధ్యాహ్నం వరిదుబ్బు, ఉత్సవ విగ్రహాన్ని పురవీధులగుండా ఊరేగించి ఆలయానికి చేరుస్తామన్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో నిలుపుదల చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### రేపు ఉచిత వైద్యశిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని, రోగులకు వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 20 నుంచి కుసుమహరనాథ్ నామసప్తాహం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం కోటవీధి కుసుమ హరనాథ్ మందిరంలో ఈ నెల 20 నుంచి 27 వరకు నామ సప్తాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మందిర సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయహరనాథ జయ- కుసుమకుమారి జయ నామంతో సప్తాహం, 26న కుసుమహరనాథ లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించి, 27న దివ్యహారతితో వేడుకలు ముగుస్తాయన్నారు.

### రోటరీ క్లబ్ సేవలు విస్తృతం



మాట్లాడుతున్న క్లబ్ చైర్మన్ సుబ్బారావు

అనకాపల్లిటౌన్: రోటరీ సేవలు మరింత విస్తృతం చేస్తామని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్వీ సుబ్బారావు అన్నారు. స్థానిక క్లబ్ ఆవరణలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే క్లబ్ చాలా సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సేవలు మరింత పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అంతకు ముందు హైస్కూల్, కళాశాలకు చెందిన 53 మంది విద్యార్థులకు ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లు, బీసీ వసతిగృహ విద్యార్థులకు 120 ట్రంకు పెట్టెలు, మహిళలకు కుట్టుమిషన్లు, వెట్‌గ్రైండర్లు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ గొల్లపూడి బుచ్చిరాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 2,584 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 3,900 | 4400 |
| రెండో రకం | 3,570 | 4,060 |
| మూడోరకం | 3,150 | 3,550 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| టైగర్ నాగేశ్వరరావు | : రాజా |
| లియో | :సత్యనారాయణస్క్రీన్-1 |
| మ్యాడ్ | :సత్యనారాయణస్క్రీన్-2 |
| భగవంత్ కేసరి | : షిర్డిసాయి |
| కీడా కోలా | : పర్తిసాయి |
| --- | : వెంకటేశ్వర |
| ఘోస్ట్ | : శ్రీసత్య |
| మా ఊరి పొలిమేర-2 | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

# ఓటే వజ్రాయుధం

- నూతన ఓటర్ల నమోదుకు చర్యలు
- ఇప్పటికే ఓటర్ల ముసాయిదా సిద్ధం
- నేడు, రేపు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు
- జనవరి 5న ఓటర్ల తుది జాబితా


బీఎల్వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఓటరూ దాన్ని వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధ చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్ నవంబర్, డిసెంబర్ నెలల్లో జాబితాకు తుది మెరుగులు దిద్ది, సార్వత్రిక ఎన్నికలకు తుది జాబితాను సిద్ధం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

**పారదర్శకంగా జాబితా**

గత నెల 27న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి నియోజకవర్గంలో ఓటర్లు ఎంతమంది ఉన్నారో లెక్క తేల్చింది. ఈ జాబితా ప్రకారం అనకాపల్లి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 251 పోలింగ్ కేంద్రాల పరిధిలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ముసాయిదా జాబితా మేరకు మొత్తం ఓటర్లు 2,06,027 మందిలో పురుష ఓటర్లు 99,666, మహిళా ఓటర్లు 1,06,356, ఇతరులు 5 గురు ఉన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎన్నికల కమిషన్ ప్రజలను కోరింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనకాపల్లి ఈఆర్వో ఏజీ చిన్నికృష్ణ ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత నియోజకవర్గంలోని మండలాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు సైతం నిర్వహించారు. వారితో ఓటరు జాబితాకు సంబంధించి తాజా షెడ్యూల్ గురించి వివరించారు. తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాల్సిందిగా వారిని కోరారు.

**నమోదుకు ప్రత్యేక శిబిరాలు**

నూతన ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ నెల 4, 5 తేదీలు, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించింది. ఈ ప్రత్యేక శిబిరాల సమయంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. నియోజకవర్గంలోని బీఎల్వోలందరికీ గురువారం అనకాపల్లిలో శిక్షణా శిబిరం ఏర్పాటు చేసి, పలు సూచనలు చేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జెడ్పీ ఈ ప్రక్రియను పర్యవేక్షించేలా ఆర్డీవో చిన్నికృష్ణ కార్యాచరణ రూపొందించారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తి చేసి తుది జాబితాను జనవరి 5న ప్రకటించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌ల తనిఖీ, మాక్ పోలింగ్ వంటి అంశాలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారుల సమక్షంలో నిర్వహించారు.

**అవకాశాన్ని వినియోగించుకోండి**



ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నవీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నాం. ఇప్పటికే బీఎల్వోలందరికీ స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ప్రత్యేక శిబిరాలను యువ ఓటర్లు వినియోగించుకోవాలి. ఓటర్లంతా తమ పేరు జాబితాలో ఉందో లేదో చూసుకోవాలి. ఒకవేళ తప్పులు ఉంటే సరిచేయించుకోవాలి. ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన వారితో పాటు, వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

– ఏజీ చిన్నికృష్ణ, ఈఆర్వో, అనకాపల్లి

# ఉచితంగా కళ్లద్దాల పంపిణీ


బీఆర్టీ కాలనీలో రోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: మండలంలోని బీఆర్టీ కాలనీలో శుక్రవారం దృష్టి లోపం ఉన్న కంటి రోగులకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడు దాడి రత్నాకర్ ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. సెప్టెంబరు 25న ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఈ కాలనీలో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఉచితంగా కళ్లద్దాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు కాలనీకి వెళ్లి గతంలో గుర్తించిన వారందరికీ తన సొంత నిధులతో కొనుగోలు చేసిన కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్టీ కాలనీతో తన తండ్రి వీరభద్రరావు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటి నుంచి మంచి సంబంధాలున్నాయన్నారు. ఈ కాలనీ తన తండ్రి హయాంలోనే ఏర్పాటైన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పేదల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు ఎన్నో విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల బలోపేతంతో పాటు, గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఇంత గొప్ప కార్యక్రమాలు దేశంలో వేరెక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో పిసినికాడ ఎంపీటీసీ మొల్లేటి హైమ, శివాజీ, రత్నాల ప్రకాశరావు, పీలా సంతోష్, భీశెట్టి తాతారావు, పి.ప్రదీప్, పోలిశెట్టి ఈశ్వరరావు, మారిశెట్టి రాము, బుద్ధ సత్యనారాయణ, మారిశెట్టి సంతోష్, బమ్మిడి రాధిక, లక్ష్మి, కీర్తి పాల్గొన్నారు.

## నేడు, రేపు ఓటరు నమోదు, సవరణ ప్రత్యేక శిబిరం

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాల్లో ఓటర్ల నమోదు, సవరణ ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి యు.రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటు తొలగింపు, తప్పుల సవరణ నిర్వహిస్తారన్నారు. కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు, ఆధార్ కార్డు, ఫొటో, టెన్త్ మార్కుల లిస్ట్, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి ఓటరు కార్డు జెరాక్స్ కాపీలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఓటు తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రం(అందుబాటులో ఉంటే), ఓటరు కార్డు నెంబర్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులకు అవసరమైన పత్రాల జెరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. కొత్త ఓటర్ల జాబితా కూడా అందుబాటులో ఉంటుందని, దీని ఆధారంగా తమ ఓటు వివరాలను ఓటర్లు పరిశీలించుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని కశింకోట పంచాయతీ పరిధిలోని ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు.

# వైద్య రంగానికి పెద్దపీట


మందులు అందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారని జీవీఎంసీ జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 500 సచివాలయం పరిధిలోని చీమలాపల్లి, పార్లపాలెం, శేషాద్రినగర్, ఎంఈఎస్ కాలనీ, బ్రహ్మం గారిమఠం ప్రాంతాల ప్రజల కోసం పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ముమ్మన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆయా రంగాలను దేశానికే ఆదర్శంగా ఉండేలా సేవలు అందిస్తున్నారని చెప్పారు. గనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. దాదాపు 400 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ, నాయకులు అయిత ఎర్రయ్య, కాళ్ల గంగాధర్, రాపర్తి మాధవరావు, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట గోవింద్, బొట్ట రాము, చిప్పల నాగదీప, జీవీఎంసీ సీవో కనకరత్నం పాల్గొన్నారు.

# డస్ట్ అలవెన్స్ చెల్లించాలని నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్‌ను తక్షణమే అమలు చేయడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ మెయిన్‌గేటు ఎదుట శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ ప్రకటించి మూడు నెలలు కావస్తున్నా నేటి వరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే వేతనాలతో అలవెన్స్ కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టులో చేసిన అగ్రిమెంట్ నేటికి అమలు కాకపోతే యూనియన్‌లు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. అలాగే ఎన్టీపీసీ లోగోతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలని కోరారు. భద్రతా ప్రమాణాలపై ఆడిట్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గోవిందరాజు, నాయకులు ఎం.సత్యనారాయణ, రాంబాబు, శ్రీను, సన్యాసిరావు పాల్గొన్నారు.

## 80 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి సమకూర్చిన రూ.కోటి నిధులతో 80 శాతం మేర పలు అభివృద్ధి పనులు జరిగాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు, తదితర పనులు నిర్వహించామన్నారు. మిగిలిన 20 శాతం పనులు మరో ఆరు నెలల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కుక్కలు.. 'భౌ'బోయ్!


పాతకోర్టువీధిలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

అనకాపల్లిటౌన్: భౌ అంటే తుమ్మపాల పంచాయతీ పాతకోర్టువీధి వాసులు బాబోయ్ అనే స్థాయిలో హడలెత్తిస్తున్నాయి వీధి కుక్కలు. ఈ వీధిలో సుమారు 1500 కుటుంబాలున్నాయి. రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు తరచూ వీరిని భయపెడుతున్నాయి. దీంతో ఆ ప్రాంతీయులు రోడ్డు మీదకు రావాలంటే గడగడలాడుతున్నారు. చిన్నారుల కనిపిస్తే చాలు.. వెంటపడుతున్నాయి. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా, ఒకట్రెండుసార్లు పట్టుకుని మళ్లీ అక్కడే వదిలేశారని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. శునకాల సంతతి తగ్గించేందుకు పంచాయతీ సిబ్బంది కు.ని. చికిత్సలు జరిపి ఎక్కడ పట్టుకున్నారో, అక్కడే విడిచి పెడుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. కుక్కల బెడద శాశ్వతంగా వదిలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలివేత

అనకాపల్లిటౌన్: రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్పు చేస్తున్నందున పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ జేఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అంజయ్యకాలనీ, గాంధీనగర్, శ్రీరాంనగర్, న్యూ బర్మాకాలనీ, లెప్రసీకాలనీ, లక్ష్మీదేవిపేట, మిరియాలకాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

## 6న పరవాడ మండల సమావేశం

పరవాడ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఏవో జి.వి.రాంబాబు చెప్పారు. సమావేశానికి ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఏవో కోరారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్


రోగుల్ని పరీక్షించి మందులు రాస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు వరంలా మారాయని జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయనతో పాటు 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై శిబిరానికి వచ్చిన 267 మంది రోగులను పరీక్షించి, అవసరమైన మందులు అందించారు. నేత్ర సంబంధిత సమస్యలున్న వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అవసరమైన 10మందిని విశాఖలోని కేజీహెచ్, పట్టణంలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి, ప్రజలకు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు జగనన్న ఆరోగ్య సురక్ష...**

పట్టణంలోని గవరపాలెం అరుంధతినగర్ యూపీహెచ్‌సీ సచివాలయం పరిధిలో అంబేడ్కర్‌నగర్ ప్రజలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్సీ ఎస్.వెంకటరమణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని టోకెన్లు పొందిన వారితో పాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా శిబిరంలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన మందులు ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ



ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరమణ

తుమ్మపాల:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, వారంలో ఓ రోజు డ్రైడేను పాటించాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ అన్నారు. పట్టణంలో 83వ వార్డు లక్ష్మీదేవిపేటలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ పాత్రలను ప్రతి శుక్రవారం ఖాళీ చేసి, ఆరబెట్టుకోవాలన్నారు. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలలో నీటిని తొలగించాలన్నారు. దోమల ద్వారా వ్యాధులు ప్రబలే అవకా శం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రజల సహకారం అవసరమన్నారు. టైర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలలో ఉన్న నిల్వల్లో వృద్ధి చెందే దోమల వ్యాప్తి నియంత్రణపై అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కశింకోట: ఆయుర్వేదం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి కె.లావణ్య అన్నారు. ఆయుర్వేద వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్లో ఆయుర్వేదంపై శుక్రవారం అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదం భారత దేశంలో ఆవిర్భవించిన ఆయుర్వేద వైద్యాన్ని విదేశాల్లో కూడా అనుసరిస్తున్నారన్నారు. ఆయుర్వేదంలో దాదాపు అన్ని రకాల వ్యాధులకు వైద్యం ఉందన్నారు. కరోనా నివారణకు ఆయుర్వేద మందులను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతోపాటు, సీజనల్ వ్యాధులు కూడా ఆయుర్వేద మందులతో త్వరగా నయం అవుతాయన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ జరిపి, విద్యార్థులకు మన నిత్య జీవనంలో ఆయుర్వేదం అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 30 పాఠశాలల్లో అభ్యసన సామర్థ్య పరీక్షలు


సీస్ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

అనకాపల్లి రూరల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు మండలంలోని 30 పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)-2023 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు 1,170 మంది హాజరయ్యారు. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహించారు. ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించిన ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను సీల్డు కవర్లలో భద్రపరిచారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి 49 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను నియమించారు. మండలంలో పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా జరిగాయని యలమంచిలి ఎంఈవో-1 వై.మీనాక్షి తెలిపారు.

# దేవీపురంలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి సామూహిక పూజలు చేస్తున్న భక్తులు


పెదనాయుడుపాలెం గ్రామంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని కామాఖ్య పీఠంలో దశ మహావిద్యలు,కామాఖ్య దేవికి సామూహిక కళావాహన పూజలు శుక్రవారం నిర్వహించారు. విశాఖపట్నంలోని అక్కయ్యపాలేనికి చెందిన స్వపంతీ మాతృ మండలికి చెందిన సుమారు 50 మంది సుహాసినీలు ఈ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 9 ఏళ్లుగా ఇదే సీజన్‌లో దేవీపురం వచ్చి మణిద్వీప వర్ణన పారాయణ 9 సార్లు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.మండలి అధ్యక్షురాలు సూర్య కుమారి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

**భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ**

మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం మండపం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సబ్బవరపు బుజ్జి, నాగేంద్ర, గొర్లి శ్రీను, శరత్,బోకం రామకృష్ణ. లాలం సతీష్ గొర్లి భాను, శ్రీకాంత్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వక కలయిక


హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు బుధవారం విశ్వవిద్యాలయ కులపతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ శేషసాయిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై వారితో చర్చించారు.

# విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారని పి.బోనంగి గ్లోబల్ సంస్కృతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో జరిగిన సౌత్ జోన్ ఆర్చరీ పోటీల్లో రికర్వ్ టీమ్ ఈవెంట్ విభాగంలో పాఠశాల విద్యార్థులు సాహిత్ కృష్ణంరాజు, వి.సాకేత్‌రామ్, కుందన్‌కుమార్‌లు విశేష ప్రతిభ కనబరినట్లు తెలిపారు. వీరు ఈ నెల 5 నుంచి 10 వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆ పోటీల్లో కూడా ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని అభిలషించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులతో పాటు కోచ్‌లు హరిరామసింగ్, గోవింద్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబును అభినందించారు.